క్లుప్తంగా

నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదులు - పరిష్కారం కార్యక్రమం

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఫిర్యాదులు, వాటి సమస్యల పరిష్కారానికి వీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదులు - పరిష్కారం కార్యక్రమంలో నగర వాసులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చి, పరిష్కరించుకోవాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్ తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో, చిట్టినగర్ సర్కిల్ – 1 కార్యాలయం , సత్యనారాయణపురంలోని సర్కిల్ – 2, పటమటలోని సర్కిల్ – 3 కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర వాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ 11 కేవీ నల్ల గేటు ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

9 కాసుల బంగారం, రూ.1.27 లక్షల నగదు చోరీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి తాళాలు విరగొట్టి బీరువాలోని 9 కాసుల బంగారపు వస్తువులు, రూ. 1.27 లక్షల నగదు చోరీ చేసిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అంబాపురం పి. నైనవరంలో అల్లంపల్లి మణికంఠ కుటుంబం నివాసం ఉంటుంది. మణికంఠ కబేళా సెంటర్‌లోని గ్రీజ్ కంపెనీలో పని చేస్తుంటాడు. శనివారం ఉదయం మణికంఠ భార్య, పిల్లలను తమ్ముడు వరసయ్యే అనిల్‌కుమార్ ఇంటి వద్ద దింపి తాను పనికి వెళ్లాడు. శనివారం రాత్రి కూడా అక్కడే ఉండి ఆదివారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటికి వచ్చే సరికి తలుపులకు వేసి ఉన్న తాళాలు పగలగొట్టి లోపల సామగ్రి అంతా చిందర వందరగా పడేసి కనిపించాయి. దీంతో లోపలకు వెళ్లి చూసే సరికి బీరువాలో ఉండాల్సిన 9 కాసుల బంగారపు వస్తువులు, వెండి సామగ్రితో పాటు రూ. 1.27 లక్షల నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడి వేలిముద్రలను సేకరించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జ్ఞాన జ్యోతిని వెలిగించేది గురువు

విజయవాడ కల్చరల్: జ్ఞానజ్యోతిని వెలిగించేది గురువు అని నాట్యాచార్యుడు పసుమర్తి శ్రీనివాస శర్మ అన్నారు. కళాపోషకుడు వల్లభజోశ్యుల పవన్‌కుమార్ శర్మ శ్రీవల్లి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వేంకటేశ్వరరావు సంగీత కళాశాలలో ఆదివారం గురు పరాగ మహోత్సవం, కూచిపూడి నాట్య ప్రదర్శనలు, నాట్యాచార్యుడు డాక్టర్ చింతారవి బాలకృష్ణకు గురుసత్కార కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసశర్మ మాట్లాడుతూ గురువు ప్రత్యక్ష దైవమన్నారు. నిర్వాహకులు డాక్టర్ చింతారవి బాలకృష్ణకు సత్కరించారు. అలాగే సంస్కార భారతి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురుపౌర్ణమి సందర్భంగా కూచిపూడి నాట్యోత్సవం, గురువులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు.

సంగీతసాహిత్యాలు భగవదత్తమైనవి



విజయవాడ కల్చరల్: సంగీత సాహిత్యాలు భగవదత్తమైన వరాలని ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎస్ చక్రధర్ అన్నారు. శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో ఆదివారం శివరామకృష్ణ క్షేత్రంలో యువ స్వరలయ సౌరభం సంస్థ నిర్వహించిన సంగీత పోటీ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. చక్రధర్ మాట్లాడుతూ బాల బాలికల్లో ప్రతిభ అంతర్లీనంగా ఉంటుందని తల్లిదండ్రులు, గురువులు ముందుగా గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. సమితి కార్యదర్శి సీవీరావ్, సంస్థ చైర్మన్ చిట్టా రామలక్ష్మి, విద్యావేత్త ఎంసీ దాస్, సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ పాల్గొన్నారు. మృదంగం, గాత్రం, వీణ, వయోలిన్ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలోని ఒక లాడ్జిలో పేకాట ఆడుతున్న తొమ్మిది మంది జూదరులను ఆదివారం ఎస్ఎన్‌పురం పోలీసులు అరెస్టు చేశారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ, సిబ్బంది ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు హోటల్స్, లాడ్జిల్లో తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో గాంధీనగర్‌లోని ఒక లాడ్జిలో తనిఖీలు చేయగా ఒక గదిలో తొమ్మిది మంది వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వారిని అరెస్టు చేసి రూ. 17,960 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణును సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



శ్రీదత్తసాయి మందిరంలో సాయిబాబా

- కిటకిటలాడిన బాబా మందిరాలు
- భక్తిశ్రద్ధలతో పూజలు.. అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు బాబా మందిరాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యాన అన్నప్రసాద వితరణ జరిగింది.

ముత్యాలంపాడు బాబా మందిరంలో...

ఆంధ్రాషిర్డీ ముత్యాలంపాడు శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బాబాకు విశేషంగా సహస్ర కలశాభిషేకం చేశారు. వేడుకల్లో ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు పెనుమత్స శిరీష, శర్వాణీమూర్తి, మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు బాబాను దర్శించుకుని పూజలు చేశారు. బాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. అతిథులను మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి బాబావారి శేష వస్త్రం, చిత్రపటంతో సత్కరించారు. సాయంత్రం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొని బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి బాబావారి శేష వస్త్రం, చిత్రపటంతో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును సత్కరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ



ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును సత్కరిస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మండలపర్తి సత్య శ్రీహరి పర్యవేక్షించారు.

శ్రీదత్తసాయి మందిరంలో...

పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. శ్రీసాయి నక్షత్ర మాలిక మండలి ఆధ్వర్యాన బాబా పారాయణం జరిగింది. అన్నప్రసాద వితరణ చేశారు. అలాగే మధురానగర్ శ్రీభగవాన్ షిర్డీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. బాబాకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే బొండా ఉమా బాబాను దర్శించుకుని పూజలు చేశారు.

శ్రీ శివజ్ఞాన పీఠంలో...

శ్రీ శివజ్ఞాన పీఠంలో ఆదివారం గురుపౌర్ణమి పురస్కరించుకుని బాబాకు పుష్పార్చన జరిగింది. పీఠాధిపతి శ్రీ శివాచార్యస్వామి బాబాకు విశేషంగా పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. చుట్టుగుంట శ్రీకల్యాణ షిర్డీ సాయిబాబా మందిరంలో కూడా ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బీసెంట్ రోడ్డులోని వీహెచ్ఆర్ కాంప్లెక్స్‌లో గల శ్రీ షిర్డీ సాయి



శ్రీభగవాన్ షిర్డీ సాయిబాబా మందిరంలో ఎమ్మెల్యే బొండా ఉమా



లెనిన్‌సెంటర్‌లో అన్నసమారాధన

బాబా మందిరంలో వ్యవస్థాపక అధ్యక్షుడు ధూళిపూడి వల్లభరావు నేతృత్వంలో గురు పౌర్ణమి వేడుకలు జరిగాయి. వేడుకల్లో ఎమ్మెల్యే బొండా ఉమా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి, ఆలయ ఉపాధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, కార్యదర్శి యాదా శ్రీనివాసరావు(రంగ), సంయుక్త కార్యదర్శులు చేవూరి శ్రీనివాసులు, గోసాల శశిధర్, కోశాధికారి చేవూరు శ్రీకృష్ణ పాల్గొన్నారు. గురుపౌర్ణమి వేడుకలు లెనిన్‌సెంటర్‌లోని ఓం శ్రీ షిర్డీ సాయిబాబా, నాగమానసాదేవి ఆలయంలో ఆదివారం నిర్వహించారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో ఆలయంలోని గురుపీఠానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 62వ డివిజన్ లక్ష్మీనగర్‌లోని సాయిబాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. సాయిబాబాకు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఏవీఎస్ రెడ్డి రోడ్డులోని శ్రీ సాయిబాబా మందిరంలో, ఉడాకాలనీలోని శ్రీసాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా బాబావారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ భగవాన్ షిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం సాయంత్రం భక్తి సంకీర్తనల గానం జరిగింది. కస్తూరి గోపాలరావు రామదాసు, త్యాగరాజు, అన్నమాచార్య తదితర కీర్తనలను ఆలపించారు. కళాకారులను ఎమ్మెల్సీ పరచూరి అశోక్ బాబు చేతులమీదుగా సత్కరించారు.

దుర్గమ్మ సన్నిధిలో వేడుకలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ పౌర్ణమి(గురు పౌర్ణమి)ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో ఆలయ వేద పండితులు శ్వావస్య మహర్షి దంపతులకు ఆలయ ఈవో కె.ఎస్.రామరావు సమక్షంలో గురు పూజ, గురు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో రామరావు వేద పండితులు శ్వావస్య మహర్షికి పాదాభివందనం చేసి ఆశీస్సులు అందుకున్నారు. గురుపూజా మహోత్సవంలో భాగంగా



వేద పండితులకు పాదాభివందనం చేస్తున్న ఈవో రామరావు

వేద పండితులను శాలువాతో సత్కరించి, పండ్లు, నూతన వస్త్రాలను సమర్పించడంతో పాటు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.

పునరావాస కేంద్రాలకు తరలించండి

వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్

పటమట(విజయవాడతూర్పు): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాల్లో ఉన్న వారందరినీ వీఎంసీ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్ ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరంగా కురుస్తున్న వర్షం కారణంగా కొండ ప్రాంతంలోని గోడలు నాని పగిలిపోవడం వలన కొండ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. వారందరినీ పట్టణ ప్రణాళిక విభాగం, వార్డు ప్లానింగ్, ఎమినిటీస్ కార్యదర్శులు కొండ ప్రాంతంలో ఉన్న ప్రజల వద్దకు వెళ్లి, వాళ్లకు కలిగే ఆపద



రోడ్డుపై పారుతున్న మురుగునీటిని పరిశీలిస్తున్న వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ మహేష్

గురించి చెప్పడమే కాకుండా వారిని అక్కడ నుంచి పునరావస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ప్రజల తరలింపును జోనల్ కమిషనర్లు నిరంతరంగా పెరిశీలించాలని సూచించారు. సిద్దార్థ నగర్, ఆంధ్రప్రభ కాలనీ ప్రాంతాల్లో రోడ్డు లెవెల్ కంటే ఎత్తులో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ మ్యాన్‌హోల్‌ను రోడ్డుకు సమాంతరంగా ఉండేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

శిశువైద్యంలో ప్రపంచానికి భారత్ ఆదర్శం

పటమట(విజయవాడతూర్పు): శిశువైద్యంలో నూతన ఆవిష్కరణలతో భారత్ ప్రపంచానికే ఆదర్శంగా మారుతోందని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ దినేష్ కుమార్ చిర్ల అన్నారు. విజయవాడలోని నోవోటెల్ హోటల్లో నియోనటల్ అండ్ పీడియాట్రిక్ ఎమర్జన్సీస్ (ఎన్‌పీఈ) అంశంపై జాతీయ స్థాయి సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సదస్సుకు దేశ వ్యాప్తంగా సుమారు 400 మంది వైద్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ శిశువైద్య నూతన ఆవిష్కరణల్లో భారతీయ వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కొందరు నవజాత శిశువులు హృద్రోగ సమస్యలతో పుడుతున్నారని, గతంలో వారు జీవించే అవకాశాలు తక్కువగా ఉండేవని తెలిపారు. నూతన ఆవిష్కరణల సహకారంతో నిపుణులైన రెయిన్‌బో ఆస్పత్రి వైద్యులు గతేడాది కేవలం 900 గ్రాముల బరువుతో జన్మించిన నవజాత శిశువుకు శస్త్ర చికిత్స చేసి పేస్ మేకర్‌ను విజయవంతంగా అమర్చారన్నారు. డెంగీ వాధి బారిన పడుతున్న వారిలో 90 శాతం మంది 15 సంవత్సరాల లోపు బాలలేనని, దోమల ద్వారా సంక్రమించే ఈ వ్యాధిపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రాంప్రసాద్ మాట్లాడుతూ.. శిశువుల ప్రాణాలు కాపాడడంలో కార్పొరేట్ వైద్యశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. డాక్టర్ శ్రీకాంత్, రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ యూనిట్ హెడ్ గుణశేఖర చౌదరి, డాక్టర్లు దినేష్ కుమార్, దుర్గాప్రసాద్, మల్లికార్జునరావు అనీల్ కుమార్, ఎస్.రాంప్రసాద్, వి.వంశీ శివరామరాజు, దుర్గా ప్రసాద్, డివిఎస్ శ్రీధర్, ఎన్.హేమకుమార్, పి.రమేష్‌కుమార్, కె.శివసత్య ప్రసూన్ తదితరులు పాల్గొన్నారు.

సి.రామ్మోహనరావు సేవలు వెలకట్టలేనివి

విజయవాడ కల్చరల్: రేడియో నాటక నటుడు, దర్శకుడు సి.రామ్మోహనరావు సేవలు వెలకట్టలేనివని పౌరాణిక రంగస్థల నటుడు పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ అన్నారు. కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ, సి.రామ్మోహనరావు కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సి.రామ్మోహనరావు 34వ వర్ధంతి, జిల్లా స్థాయి రంగస్థల కళాకారుల ఆత్మీయ సమావేశం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై ఆదివారం నిర్వహించారు. లక్ష్మీకాంత శర్మ మాట్లాడుతూ సి.రామ్మోహనరావు సుదీర్ఘకాలం విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో పనిచేసి ఎంతో మంది ప్రముఖులను రేడియో ద్వారా పరిచయం చేశారన్నారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రానికి జాతీయ అవార్డులను తెచ్చిపెట్టారని కొనియాడారు. సి.రామ్మోహనరావుతో ఉన్న అనుబంధాన్ని సి.రామ్మోహనరావు కల్చరల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు హరగోపాల్, ఆచంట బాలాజీనాయుడు, పీవీఎల్ నృసింహం, శింగంపల్లి వెంకటరమణ, పిల్లుట్ల నిరంజన్, మాడుగుల రామకృష్ణ తదితరులు గుర్తు చేసుకున్నారు.

సంక్షిప్త వార్తలు

నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావాలి

విజయవాడ కల్చరల్: తెలుగు నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావాలని మాజీ పార్లమెంట్ సభ్యుడు వడ్డే శోభనాదీశ్వరరావు అన్నారు. తంగిరాల మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఠాగూరు గ్రంథాలయంలో రంగస్థల ప్రముఖుడు తంగిరాల కృష్ణ ప్రసాద్ స్మారక ఉపన్యాసం, రంగస్థల దర్శకుడు సుఖమంచి కోటేశ్వరరావుకు తంగిరాల విశిష్ట స్మారక పురస్కార ప్రదానం వివిధ రంగాలకు చెందిన 20 మందికి తంగిరాల పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. శోభనాదీశ్వరరావు కృష్ణప్రసాద్ రంగస్థల సేవలను వివరించారు. నిర్వాహకులు సుఖమంచి కోటేశ్వరరావుకు తంగిరాల కృష్ణ ప్రసాద్ స్మారక రంగస్థల పురస్కారం, వివిధ రంగాలకు చెందిన వారికి తంగిరాల కృష్ణ ప్రసాద్ స్మారక విశిష్ట పురస్కారాలు ప్రదానం చేశారు. యం. బాలగంగాధరయ్య రచించిన నాటక త్రయం సంపుటిని అతిథులు ఆవిష్కరించారు.

ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అగ్రి ఇన్‌పుట్స్ మాన్యుఫ్యాక్చరర్స్ అండ్ మార్కెటింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఏకగ్రీవమైంది. విజయవాడలో ఆదివారం అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ గౌరవాధ్యక్షుడిగా సి.పీటర్‌పాల్, అధ్యక్షుడిగా ఎ.నాగేశ్వరరావు, కార్యదర్శిగా పి.కృష్ణప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా ఎ.హరికృష్ణ, ఉపాధ్యక్షుడిగా జి.జగదీష్, కోశాధికారిగా ఎం.మోహనరావు ఎన్నికయ్యారు. అనంతరం అసోసియేషన్ కార్యదర్శి కృష్ణప్రసాద్ బయోస్టిములెంట్స్ ప్రాధాన్యం, ప్రభుత్వ విధి, విధానాలను వివరించారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు స్వచ్ఛంద సేవలను సద్వినియోగం చేసుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని ఇంజనీర్ కృష్ణ ప్రసాద్ సూచించారు. స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డులోని హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం ట్రస్ట్ ఆధ్వర్యాన నిరుపేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ, నిరుపేద విద్యార్థులను గుర్తించి వారికి ఉచితంగా నోట్‌పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, హిరణ్య, ప్రవీణ్, నాగరాజు, శ్రీనివాసు, పాపారావు, నాగూర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ సొసైటీ అక్రమాలపై విచారణ చేపట్టాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల గృహ నిర్మాణ సంఘంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని శ్రీహరిపురం గవర్నమెంట్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం అసోసియేషన్ సమావేశం జరిగింది. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.శ్రీనివాస్, వి.రత్నప్రసాద్ మాట్లాడుతూ హౌసింగ్ సొసైటీ మేనేజింగ్ కమిటీ అవినీతి అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. 2016లో కోఆపరేటివ్ చట్టం ద్వారా హౌసింగ్ సొసైటీ ఏర్పాటైందన్నారు. ఐసీడీఎస్ మాజీ ఉద్యోగులు అడ్డాల సుబ్బరాజు, నాదెండ్ల విశ్వనాథం సొసైటీ ఏర్పాటు చేసి 2019లో ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండలో 85 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఏపీసీఆర్‌డీఏ అనుమతితో లేఅవుట్ వేసి 825 ప్లాట్లుగా విభజించారు. వీటిలో 653 ప్లాట్లు చదరపు గజం రూ. 12వేల ధరకు విక్రయించారని, మార్టిగేజ్ చేసిన 72 ప్లాట్లు అడ్వాన్సులు సేకరించారు. సభ్యులకు తెలికుండా ఏక పక్షంగా తీర్మానాలు చేయడం, రూ. 2లు అధిక వడ్డీకి రుణాలు తెచ్చి సొసైటీపై భారం మోపారన్నారు. ప్రభుత్వం స్పందించి హౌసింగ్ సొసైటీ మేనేజింగ్ కమిటీ అక్రమాలపై విచారణ జరపాలన్నారు. సభ్యులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా అమ్మవారు



కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించిన వి వైశ్య నేత్ర సంస్థ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం అమ్మవారు శాకంబరీ అలంకరణలో పూజలు అందుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి విశేష అర్చనలు కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు, మహిళలు అమ్మవారిని దర్శించుకుని సారె సమర్పించారు..

శ్రీ బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో...

మధురానగర్‌లో స్వయం భూ శ్రీబాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవాలయంలో ఆదివారం శాకంబరీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శ్రీ రాజరాజేశ్వరీ అమ్మవారికి ఆషాఢ మాస పూర్ణిమ సందర్భంగా ఆలయ ధర్మకర్తల కుటుంబ సభ్యులు బోయిన గోపాలకృష్ణ మూర్తి, శ్యామల దంపతుల ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు.

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):



శ్రీ అంకమ్మతల్లి

స్థానిక సత్యనారాయణపురంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం శాకంబరీ దేవి ఉత్సవాలను నిర్వహించారు. ఎమ్మెల్యే బొండా ఉమా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ తుమ్మలపెంట శ్రీనివాసులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ...

సత్యనారాయణపురంలోని 'వి వైశ్య నేత్ర' సంస్థ సభ్యులు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆషాఢ మాస సారె సమర్పించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు సీతన్నపేట బీఆర్టీఎస్ రోడ్డు నుంచి ఊరేగింపుగా సారెను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బీచ బద్రీనాథ్, కోశాధికారి హరిప్రియ, సభ్యులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీ హక్కుల సాధనకు పోరాడాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీ హక్కుల సాధన కోసం ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) సభ్యులంతా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. ఏఎంసీ ప్రతినిధుల సమావేశం సింగ్‌నగర్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద ముస్లిం ప్రజలకు బాసటగా నిలవాలనేదే ఏఎంసీ ప్రధాన ధ్యేయమని స్పష్టంచేశారు. సేవా కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా అధ్యక్షుడు, చిలకలూరిపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ అబ్దుల్ అజీజ్ విజ్ఞప్తి మేరకు చందవరం గ్రామానికి చెందిన వికలాంగ సోదరుడు షేక్ మస్తాన్ వలీకి ట్రై సైకిల్ అందజేసినట్లు తెలిపారు. కమిటీ సభ్యులు షేక్ సాజిద్ అలీ, యండీ కాలేషా, సయ్యద్ మౌలాలి, అబ్దుల్ అజీజ్, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.



మస్తాన్ వలీకి ట్రై సైకిల్ అందిస్తున్న నాగుల్‌మీరా

తోటి వారికి సాయం చేయడంలోనే నిజమైన ఆనందం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తోటి వారికి సహాయం చేయడంలోనే నిజమైన ఆనందం ఉంటుందని లయన్స్ క్లబ్(316డి) జిల్లా గవర్నర్‌గా ఎన్నికైన గద్దె శేషగిరిరావు అన్నారు. లయన్స్ జిల్లా క్యాబినెట్ ఇన్‌స్టలేషన్ ఆదివారం సాయంత్రం పోరంకిలోని ఓ రిసార్ట్‌లో జరిగింది. ఈ సందర్భంగా గద్దె శేషగిరిరావు మాట్లాడుతూ లయన్స్ అంటేనే సేవ, సహాయానికి మారుపేరు అని అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఎక్కువ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. క్లబ్ వైస్ గవర్నర్ వీవీపీఎస్.ఆంజనేయులు, క్లబ్ పాస్ట్ గవర్నర్స్ మిరియాల వెంకటేశ్వరరావు, శంకర గుప్తా, లయన్స్ క్లబ్ ప్రతినిధులు యర్రంశెట్టి శివరామకృష్ణ, సుంకర కృష్ణ జిల్లాలోని లయన్స్ క్లబ్ సభ్యులు హాజరై జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి రావును అభినందించారు.



మాట్లాడుతున్న లయన్స్ జిల్లా గవర్నర్ శేషగిరిరావు

మారిన జీవనశైలితో ఆరోగ్య సమస్యలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ చేకూరి మురళీ అన్నారు. స్థానిక ప్రకాష్‌నగర్ లహరి విద్యామందిర్‌లో ఆదివారం ప్రజా ఆరోగ్య వేదిక, జన విజ్ఞాన వేదిక కమిటీల ఆధ్వర్యాన హెల్తీ విజయవాడ రెగ్యులర్ మెడికల్ క్యాంపు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు అండగా హెల్తీ విజయవాడ మెడికల్ క్యాంప్ ఉపయోగపడుతుందని అన్నారు. సుమారు 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమాలను మెడికల్ క్యాంపు కోఆర్డినేటర్స్ ప్రజా ఆరోగ్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయ్ ప్రకాష్, జన విజ్ఞాన వేదిక విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి వెలగా శ్రీనివాస్, బోయి రవికుమార్, లీలా సుందరి, విజితా రాణి, సత్య ప్రసాద్, భాను ప్రసాద్, మధు, ప్రేమ్ తదితరులు పర్యవేక్షించారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మురళీ

చేయూత కార్యాలయం ప్రారంభం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజాసమస్యల పరిష్కార వేదికగా 'చేయూత' కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా వినియోగదారుల కమిషన్ న్యాయమూర్తి చిరంజీవి నేలపూడి అన్నారు. స్థానిక మధురానగర్ పైపుల కంపెనీ షిర్డీ సాయిబాబా మందిరం సమీపంలో ఆదివారం 'చేయూత-సాంఘిక, సాంస్కృతిక సంక్షేమ సంఘం' ఆధ్వర్యాన ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'చేయూత' కార్యాలయ ప్రారంభోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రజలు, వినియోగదారుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసేందుకు గానూ ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం, దానిని తన చేతులమీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, ఆంధ్రప్రదేశ్ పూర్వపు లా సెక్రటరీ సి.దుర్గాప్రసాద్, జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యులు అక్కిపెద్ది వెంకటరమణ, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ఓఎస్‌డీ ఎం.వెంకటసుబ్బయ్య, ఏపీఎన్‌జీఓ నాయకులు పీవీఎల్ఎస్ రాజు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా వినియోగదారుల కమిషన్ న్యాయమూర్తి చిరంజీవి

విద్యార్థిని అదృశ్యం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం(రాధానగర్) ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో ఇంటర్ సెకండియర్ చదువుతున్న విద్యార్థిని అదృశ్యం కావడంతో ఆదివారం నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు కొండపల్లికి చెందిన విద్యార్థిని(16) రాధానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతుంది. ఈ నెల 12వ తేదీన హోమ్‌సిక్ సెలవులకు ఇంటికి వెళ్లిన విద్యార్థిని 20న ఆటోలో బాలికల హాస్టల్‌కు వచ్చింది. అదేరోజు మధ్యాహ్నం కాలేజీకి వెళుతున్నట్లు చెప్పి ఎటో వెళ్లిపోయింది. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.